నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

గంజాయి నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

మామిళ్లగూడెం, మే 31 : వివిధ ప్రాంతాల్లో నిషేధిత గంజాయిని సేవిస్తూ.. విక్రయాలకు పాల్పడుతున్న నలుగురు యువకులను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఎస్ఆర్ గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో నలుగురు యువకుల తీరు అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో వారి వద్ద సోదాలు నిర్వహించగా.. ఎండు గంజాయి 460 గ్రాములు లభ్యం కావడంతో వెంటనే వారిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఖమ్మం నగరంలోని నిజాంపేటకు చెందిన గుత్తికొండ యశ్వంత్, తిరుమలాయపాలెం మండలం కొక్కెరేణి గ్రామానికి చెందిన చింతినేని విజేంద్ర ప్రసాద్, ఖమ్మం నగరంలోని పాండురంగాపురం ప్రాంతానికి చెందిన షేక్ అమీర్, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణానికి చెందిన తేజావత్ నితిన్‌లు ఉన్నట్లు తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాంకు తరలించామని ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-1 సీఐ బి.కృష్ణ తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు ఎస్.జయశ్రీ, కె.సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం రూరల్, మే 31 : లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు కోసం చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, ఏజెంట్ల ప్రవేశ మార్గంపై పలు సూచనలు చేశారు. కేంద్రం ఆవరణ, కేంద్రంలో చేపట్టాల్సిన బారికేడ్ల ఏర్పాటుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పార్కింగ్, క్లోక్‌రూం ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య శిబిరం, మీడియా పాయింట్ గురించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఫలితాల ప్రకటనలపై చర్యల గురించి ఆదేశాలిచ్చారు. కౌంటింగ్ కేంద్రంలోకి కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్ల ప్రవేశం, స్ట్రాంగ్‌రూం నుంచి కౌంటింగ్ హాల్‌కి, కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను జిల్లా స్ట్రాంగ్‌రూంనకు చేరవేతపై అధికారులకు సూచనలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ ప్రసాదరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, పౌరసరఫరాల

మేనేజర్ శ్రీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు. అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ గౌతమ్

అంబరాన్నంటేలా అవతరణ ఉత్సవాలు

ముఖ్య అతిథిగా సింగరేణి సీఎండీ బలరాం

సినీ, టీవీ కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు

వివరాలు వెల్లడించిన జీఎం పర్సనల్ దీక్షితులు

ఆవిర్భావ వేడుకల వివరాలు వెల్లడిస్తున్న జీఎం పర్సనల్ బీఆర్ దీక్షితులు

సింగరేణి కొత్తగూడెం, మే 31: తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలను సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో అంబరాన్నంటేలా నిర్వహించనున్నట్లు జీఎం సెక్యూరిటీ, వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ బీఆర్ దీక్షితులు పేర్కొన్నారు. కొత్తగూడెం హెడ్డాఫీస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో జూన్ 2న అత్యంత వైభవంగా జరిగే తెలంగాణ ఆవిర్భావ పదో వార్షిక వేడుకల వివరాలను వెల్లడించారు. సింగరేణి సీఎండీ బలరాం ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 8 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. అనంతరం తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి ప్రకాశం స్టేడియానికి చేరుకుంటారని, కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అమరవీరుల స్తూపం వరకు తెలంగాణ రన్ నిర్వహిస్తారని అన్నారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన తెలంగాణ వీరులకు నివాళులర్పించనున్నట్లు వివరించారు. అనంతరం ప్రకాశం స్టేడియంలో పతాకావిష్కరణ ఉంటుందని, తర్వాత ఎస్అండ్‌పీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సమర్పించే గౌరవ వందనం స్వీకరించి తన సందేశాన్ని ఇస్తారని అన్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రకాశం స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రముఖ సినీ గాయకులు మాళవి, పవన్ కల్యాణ బృందంతో సినీ మ్యూజికల్ నైట్, ఈటీవీ జబర్దస్త్ ఫేమ్ రాంప్రసాద్, శాంతిస్వరూప్ బృందంతో కామెడీ, ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు రవితో మిమిక్రీ ప్రదర్శన, ఈటీవీ ఢీ టీం డాన్స్ ఫేమ్ రాజు బృందంతో డాన్స్ ప్రదర్శన, రాం అఖిల్‌తో ఇంద్రజాల ప్రదర్శన, ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారిణి సీతాప్రసాద్ బృందంతో క్లాసికల్ డాన్స్ ప్రదర్శన వంటివి ఉంటాయని వివరించారు. ప్రముఖ యాంకర్ దీప్తి పాల్గొంటారని అన్నారు. సింగరేణి కార్మికులందరూ ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. సింగరేణి అధికారులు కే.శ్రీనివాసరావు, సుశీల్, టీ.శ్రీనివాసరావు, జీకే కిరణ్‌కుమార్, వరప్రసాదరావు, పాస్‌నెట్, ఇజాజ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బువ్వ పెట్టే భూములు లాక్కుంటే బతికేదెలా?

సీఆర్‌పీఎఫ్‌కు మరోచోట భూములు చూసుకోండి

రుద్రంపూర్ తండా వాసులు, రైతుల ఆందోళన

సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అడ్డగింత.. ఇరువురి వాగ్వాదం..

సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన గిరిజనులు

చుంచుపల్లి, మే 31 : సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు భూముల కేటాయింపు అంశంలో కొన్నేళ్లుగా జరుగుతున్న వివాదం తాజాగా మరోసారి తెరమీదకొచ్చింది. తమ భూములను తాము ఇవ్వబోమంటూ రైతులు, ప్రభుత్వం తమకు కేటాయించిందంటూ సీఆర్‌పీఎఫ్ అధికారులు వాదనలు వినిపిస్తున్నారు. తాజా పరిణామంలో స్థానికుల కథనం ప్రకారం.. చుంచుపల్లి మండలం రుద్రంపూర్, లక్ష్మీపురం తండా, త్రీ ఇంక్లైన్, ఫోర్ ఇంక్లైన్ వెనక ప్రాంతాలను ఆనుకొని సుమారు 70 ఎకరాలను స్థానిక రైతులు అనేక ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారు. అయితే గతంలో అప్పటి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే ఈ 70 ఎకరాలను సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు అప్పగించారు. దీంతో ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు సీఆర్‌పీఎఫ్ అధికారులు క్షేత్రస్థాయికి వచ్చిన ప్రతిసారీ రైతులు అడ్డుకుంటున్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడం, రైతుల నిరసనతో బెటాలియన్ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోవడం వంటివి జరుగుతున్నాయి. ప్రభుత్వ పరంగా రెవెన్యూ, పోలీసు శాఖలు కూడా సీఆర్‌పీఎఫ్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. దీంతో ప్రతిసారీ ఈ అంశం మరింత జఠిలమవుతోంది.

బోర్డులు పాతేందుకు రావడంతో..

తాజాగా శుక్రవారం కూడా రుద్రంపూర్ తండా సమీపంలో బోర్డులు పాతేందుకు బెటాలియన్ సిబ్బంది వచ్చారు. తండాలో నివాసం ఉంటున్న ప్రజల ఇళ్లను ఆనుకొని హద్దులను నిర్ధారించారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో ఇటు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, అటు రైతులు, స్థానికులు వాగ్వాదానికి పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది. వందల ఏళ్లుగా తమ తాతముత్తాతల నుంచి తాము ఈ భూములను సాగు చేసుకుంటూ బతుకుతున్నామని, ఇలాంటి భూములను లాక్కుంటే తాము బతికేదెలాగని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ సీఆర్‌పీఎఫ్ అధికారులు సరిహద్దులు పాతి వెళ్లిపోయారు.

రంగు మార్చిన లైట్లు!

విద్యుత్ దీపాలంకరణలో సింగరేణి హెడ్డాఫీస్

కొత్తగూడెం సింగరేణి, మే 31 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు వేళయింది. జూన్ 2వ తేదీన ఆవిర్భావ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సింగరేణి సంస్థలో ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం కొత్తగూడెం కార్పొరేట్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయం, హెడ్డాఫీస్ ఎదురుగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలను రంగురంగుల విద్యుత్ బల్బులు వేసి అలంకరించారు. అయితే గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గులాబీ రంగు విద్యుత్ బల్బులతో ముస్తాబు చేసేవారు. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హెడ్డాఫీస్, తెలంగాణ తల్లి విగ్రహాలకు మూడు రంగులు కనిపించే విధంగా బల్బులు వేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు చర్చించుకుంటున్నారు.

'ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి'

టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మామిళ్లగూడెం, మే 31: జిల్లాలో ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అధికారులకు సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఐడీవోసీలోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ధరణి, పెండింగ్ రిజిస్ట్రేషన్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఫిజికల్ ఫైళ్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే ఆర్డీవో లాగిన్‌కు వస్తాయని అన్నారు. వాటిని ఆర్డీవోలు పరిశీలించి అదనపు కలెక్టర్‌కు సమర్పించాలని సూచించారు. పెండింగ్ స్లాట్ల పరిష్కారాన్ని పూర్తి చేయాలని సూచించారు. 'ధరణి ఫిజికల్ ఫైళ్ల ఆన్‌లైన్ – పెండింగ్ రిజిస్ట్రేషన్ల స్లాట్లు' అంశాలపై జూన్ 7న కలెక్టర్ కలెక్టర్ సమీక్షించనున్నట్లు చెప్పారు. డీఆర్‌వో రాజేశ్వరి, ఆర్డీవోలు గణేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థలం తరహాలో విలేజ్ సెట్

రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' షూటింగ్‌లో ఓవైపు బిజీగా ఉంటే.. మరోవైపు 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో చేయనున్న ఆయన తదుపరి సినిమాకు సంబంధించి ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. క్రీడా నేపథ్యంతో కూడిన గ్రామీణ కథతో తెరకెక్కనున్న ఈ పాన్ ఇండియా సినిమా కోసం హైదరాబాద్ నడిబొడ్డున ఒక విలేజ్ సెట్‌ను మేకర్స్ నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ నివాసానికి అతి చేరువలో ఈ భారీ సెట్‌ను నిర్మిస్తుండటం విశేషం. ఈ సినిమా షూటింగ్ 75శాతం ఈ సెట్‌లోనే జరుగనున్నదట. ఈ సెట్ పూర్తికావడానికి కనీసం రెండు నెలలైనా పడుతుందని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. గతంలో రామ్‌చరణ్ 'రంగస్థలం' కోసం కూడా ఇలాగే ఓ విలేజ్ సెట్‌ని నిర్మించిన విషయం తెలిసిందే. ఆ సెట్ అప్పట్లో చర్చనీయాంశంగా నిలవడమేకాక, సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు బుచ్చిబాబు కూడా గురువు దారిలోనే పయనిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇంకా పేరు నిర్ణయించని ఈ సినిమాకోసం రామ్‌చరణ్ తన శరీరాకృతిని మార్చుకునే పనిలో ఉన్నారట. జాన్వీకపూర్ కథానాయికగా నటించనున్న ఈ సినిమాకు ఏ.ఆర్.రెహమాన్ స్వరాలందించనున్న విషయం తెలిసిందే. మైత్రీమూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి వృద్ధి సినిమాస్ ఈ భారీ బడ్జెట్ సినిమాను నిర్మిస్తున్నది.

మహారాణిలా కనిపించాలి

'జయాపజయాల గురించి పెద్దగా ఆలోచించను. మన చేతిలో లేని విషయాల గురించి పట్టించుకోకపోవడమే బెటర్ అనుకుంటా' అని చెప్పింది కృతిశెట్టి. ఆమె శర్వానంద్ సరసన నటిస్తున్న తాజా చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. జూన్ 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కృతిశెట్టి మాట్లాడుతూ 'ఈ సినిమాలో నా పాత్ర పేరు సుభద్ర. తను ప్రతి విషయంలో క్రమశిక్షణతో ఉంటుంది. నేను ఇప్పటివరకు చలాకీగా, సున్నిత మనస్కురాలైన అమ్మాయి పాత్రల్లోనే ఎక్కువగా నటించాను. కానీ అందుకు భిన్నంగా 'మనమే'లో నా పాత్ర కొత్త కోణంలో సాగుతుంది. ఈ కథలో హార్ట్‌టచింగ్ ఎమోషన్స్ ఉంటాయి. ప్రతి ఒక్కరికి కనెక్ట్ అయ్యే యూనివర్సల్ కాన్సెప్ట్ ఇది. తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉండే అనుబంధం హృదయంగా అనిపిస్తుంది' అని చెప్పింది. తన డ్రీమ్ రోల్ గురించి మాట్లాడుతూ ''బాహుబలి' సినిమాలో అనుష్క తరహా ప్రిన్సెస్ పాత్రలు చేయడం చాలా ఇష్టం. అలాగే యాక్షన్, మార్షల్ ఆర్ట్స్ నేపథ్యం ఉన్న రోల్స్ చేయాలని ఉంది' అని తెలిపింది. ప్రస్తుతం తమిళ, మలయాళ భాషల్లో ఒక్కో సినిమా చేస్తున్నానని, ఫెయిల్యూర్స్ గురించి పెద్దగా ఆలోచించకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపైనే దృష్టిపెట్టానని కృతిశెట్టి పేర్కొంది.

చిత్రం

థియేటర్లు మళ్లీ కళ కళలాడుతున్నాయ్

'తెలుగు ప్రేక్షకులకు సినిమాలంటే ఇష్టం. సినిమాలను బాగా ప్రేమిస్తారు. పలు కారణాల వల్ల థియేటర్లు మూసేస్తున్న పరిస్థితి నెలకొనివుంది. అలాంటి పరిస్థితుల్లో ఒక సినిమా వల్ల జనాలు థియేటర్లకు వస్తున్నారంటే ఆనందం పడాల్సిన విషయం. ఏదిఏమైనా నా సినిమాల వల్ల థియేటర్లకు కళ రావడం సంతోషంగా ఉంది' అని విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. అంజలి, నేహాశెట్టి కథానాయికలు. కృష్ణచైతన్య దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ శుక్రవారం సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా కథానాయకుడు విశ్వక్‌సేన్, చిత్ర దర్శకుడు కృష్ణచైతన్య విలేకరులతో ముచ్చటించారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ 'జనాల్లో స్పందన బాగుంది. ఆడపిల్లలకు సెకండాఫ్ బాగా నచ్చింది. డిస్ట్రిబ్యూటర్లు ఫోన్లు చేసి రెవెన్యూలు చెబుతుంటే చాలా ఆనందం అనిపించింది. బాలకృష్ణగారు ఫోన్ చేసి శుభాశీస్సులు అందించారు. ఈ సినిమాకు సెకండ్ పార్ట్ కూడా ఉంటుంది. కథ రెడీ చేసే పనిలో ఉన్నాను. అది సీక్వెలా? లేక ప్రీక్వెలా? అనేది త్వరలో చెబుతా. రాజీపడకుండా ఇంత మంచి సినిమా తీయడానికి సహకరించిన నిర్మాతలకు థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అన్నారు.

సూపర్ హ్యూమన్ వెపన్

సత్యరాజ్, వసంత్‌రవి, తాన్య హోప్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'వెపన్'. గుహన్ సెన్నియప్పన్ దర్శకుడు. అబ్దుల్, మన్సూర్, అజిజ్ నిర్మాతలు. ఈ నెల 7న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. సత్యరాజ్ మాట్లాడుతూ 'పెన్, మైక్ గొప్ప ఆయుధాలు. వీటితో సమాజాన్ని ప్రేరేపించే మీడియా ఇంకా పెద్ద ఆయుధం. ఈ నేపథ్యంలోనే సినిమా సాగుతుంది. సూపర్ హ్యూమన్ సాగా కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ సినిమా ఓ కొత్త ట్రెండ్‌ని క్రియేట్ చేస్తుందని నమ్మకంగా చెప్పగలను. గుహన్ మంచి కథ రాసుకున్నాడు' అని తెలిపారు. రెండో ప్రపంచయుద్ధాన్ని బేస్ చేసుకుని ఈ కథ రాసుకున్నాననీ, ఈ నెల 7న విడుదల కానున్న ఈ యాక్షన్ ప్యాక్డ్ మూవీ అందరికీ నచ్చుతుందని దర్శకుడు చెప్పారు. ఇంకా చిత్ర బృందం అంతా మాట్లాడారు.

జై బోలో కృష్ణ..



సూపర్‌స్టార్ కృష్ణ మనవడు అశోక్ గల్లా రెండవ చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. వారణాసి మానస కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ జంధ్యాల దర్శకుడు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానుంది. మేకర్స్ ప్రమోషన్‌ని వేగవంతం చేశారు. ఇప్పటికే విడుదల చేసిన తొలి పాటకు ఆడియన్స్‌లో మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా శుక్రవారం రెండో పాటను విడుదల చేశారు. 'జై కృష్ణ.. జై బోలో కృష్ణ.. కృష్ణ కృష్ణ..' అంటూ సాగే ఈ పాటను రఘురామ్ అడ్వకేట్ రాయగా, భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. స్వరాగ్ కీర్తన్ ఆలపించారు. సినిమాలో కృష్ణజన్మాష్టమి సందర్భంగా వచ్చే పాట ఇదని చిత్రీకరణ చెప్పకనే చెబుతున్నది. యష్ మాస్టర్ డ్యాన్స్ మూమెంట్స్, అశోక్ గల్లా ఎనర్జీ పాటకు కొత్త ఊపును తెచ్చాయని మేకర్స్ చెబుతున్నారు. స్పిరిచ్యువల్ ఎలిమెంట్స్‌తో కూడిన ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు అర్జున్ జంధ్యాల ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి కథ: ప్రశాంత్‌వర్మ, మాటలు: సాయిమాధవ్ బుర్రా, కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, నిర్మాణం: లలితాంబిక ప్రొడక్షన్స్.

సమాజ భవితను మార్చిన వ్యక్తి కథ

తనను చిన్నచూపు చూసే సమాజం భవితను మార్చిన ఓ వ్యక్తి కథతో రూపొందుతోన్న చిత్రం 'తుఫాన్'. విజయ్ ఆంటోనీ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి విజయ్ మిల్టన్ దర్శకుడు. కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మాతలు. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్న ఈ సినిమాను జూన్‌లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా టీజర్ లాంచ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. చిత్రబృందం మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ ' అందరికీ నచ్చే యాక్షన్ ప్యాక్డ్ మూవీ 'తుఫాన్'. ఎన్నో గొప్ప సినిమాలకు ఛాయాగ్రహణం అందించి డీవోపీగా తనేంటో ఇప్పటికే నిరూపించుకున్న విజయ్ మిల్టన్ ఈ సినిమాతో దర్శకుడిగా సత్తాచాటనున్నారు. ఆయనతో పనిచేయడం ఆనందంగా ఉంది. సత్యరాజ్, శరత్‌కుమార్, డాలీ ధనుంజయ వంటి గ్రేట్ ఆర్టిస్టులు ఈ సినిమాలో భాగమయ్యారు. సాంకేతికంగా కూడా నెక్స్ట్ లెవల్లో ఉంటుందీ సినిమా. నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. భారీ నిర్మాణ విలువలతో ఈ చిత్రం రూపొందుతున్నది' అని తెలిపారు. ఒక దీవిలో జరిగే కథ ఇదని, ఒక అపరిచిత వ్యక్తి సమాజంలోకి అడుగుపెట్టాక ఈ కథ మొదలవుతుందని, తుఫాన్ వచ్చే ముందు ఎలా ప్రశాంతంగా ఉంటుంటో ఇందులో హీరో పాత్ర అలా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.